# గోమాత కరుణించింది!

ట్రైన్ దిగాను స్టేషన్ బయటికొచ్చాను. జేబులో కార్డుమీది అడ్రస్ చూశాను. ఆటోని పిల్చి ఎక్కి కూర్చున్నాను. ఎక్కడికి పోవాలో చెప్పాను. గంటలో కోరండరామయ్యగారి సత్రం చేరాను.

సత్రం ఏనాటిదో? ఎవరు కట్టించారో, ఎన్నాళ్ళయిందో కానీ శిథిలావస్థలో వున్నట్టుంది. సత్రం గుమ్మంలో షామియానా వుంది. షామియాలో బల్లలు, కుర్చీలూ ఓ ఇరవై మెట్లు ఎక్కి సత్రంలోకి వెళ్ళాను. నేనెళ్ళేసరికి అక్కడ గొప్ప హడావుడిగా వుంది. బ్రాహ్మడు గోదానం స్వీకరిస్తున్నాడు. పంతులు గారు మంత్రాలు చదువుతున్నారు. అందరి దృష్టి నా మీద పడింది.

“ఏం మావయ్యా! ఇప్పుడా రావటం?” అని మా మేనల్లుడు నారాయణమూర్తి అంటే, “ఇప్పుడయినా వచ్చినందుకు సంతోషించురా!” అని వాళ్ళ చెల్లి అప్పుడే ఓ బాణం సంధించేసింది. “ఏంరోయ్! ఒక్కడివే వచ్చావా? పోనీ, పిల్లల్నయినా తీసుకురాలేక పోయావా?” మా బావ అన్నాడు. అందరి ప్రశ్నలకీ నా చిరునవ్వే సమాధానం అయింది.

“ఒరే వెంకూ! మావయ్యకి లుంగీ ఇచ్చి, సూట్‌కేస్ గదిలో పెట్రా! అని మా రెండో మేనల్లుడుకి పురమాయించాడు.

“లుంగీ వుందిలే” అన్నాను.

“స్నానం చేశావా? భోజనాలు సిద్ధం అయిపోయాయి. టీ, కాఫీ ఏదన్నా తాగుతావా?” అన్నాడు.

“నీ పనికానీ నాకేం మొఖమాటం లేదు” అని గదిలోని కెళ్ళి సూట్ కేస్‌లో బనీను, తువ్వాలూ, లుంగీ తీశాను. సబ్బుపెట్టె పట్టుకొని బయలుదేరాను.

“స్నానంకి నీళ్ళెక్కడ?”

“వేణ్ణీళ్ళు కావాలా?”

“అవసరం లేదు”

“అయితే పద” అని మా మేనకోడలు చాదా, బకెట్టు పట్టుకొని దిగి కింది కెళ్ళాను. ఓ పక్కగా నుయ్యి వుంది. నూతి పక్కన పెద్దరావిచెట్టు వుంది. ఆ రావిచెట్టు నుండి రాలుతోన్న ఆకులు నూతిలోనే పడుతున్నాయి. వాటిని ఎవరూ తీస్తున్నట్టు లేదు. నూతి చుట్టూ పాకుడు కట్టి వుంది.

“జాగ్రత్త మావయ్యా! కాలు జారగలదు” మా మేనకోడలు శ్లేషను జొప్పిస్తూ అన్నది.

నేను నవ్వాను.

“ఏం మావయ్యా! అమ్మ పోయినప్పుడు వస్తావనుకొన్నాం. అమ్మ నీవు వస్తావనే ఏమో, మరి రెండురోజులు ఎక్కువ బ్రతికింది పోయే ముందు మాత్రం విసిగించేసింది. తను బ్రతికినంత

కాలం ఎన్నడూ ఎవర్నీ కష్టపెట్టలేదుగానీ 'ఏమ్రా! భాస్కరానికి ఫోనన్నా చెయ్యండ్రా. వాణ్ణి చూడాలని వుంది.'' అని ఎన్ని సార్లు చెప్పిందో. చివరికి ప్రాణం పోయే ముందు కూడా ఎటో చూస్తూనే ప్రాణం విడిచింది'' అంది. అని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"ఏడవకమ్మా పెద్దాడిచ్చిన టెలిగ్రామ్ నాకు రెండు రోజుల తరువాత అందింది. పోనీ ధర్మోదాకాల్నాటికయినా రావాలనుకుంటే ఆఫీసు కేంపు తగిలింది'' అని స్నానం చేసి మళ్ళీ మెట్లన్నీ ఎక్కి భోజనాల హాలులోకెళ్ళాను.

చేయాల్సిన దానాలన్నీ అయిపోయినట్లున్నాయి.

పంతులుగారు గోవు మెడలో కన్నె బిగించాడు. అతనికి సహాయం మరో కుర్రాడు దూడని ముందు తీసుకొని నడుస్తున్నాడు.

"పంతులుగారూ! భోజనం చెయ్యకుండా ఎక్కడికి?'' అడిగాడు నారాయణమూర్తి.

"అబ్బే! దీన్నింటికి సాగనంపి నచ్చేస్తా''

"సరే త్వరగా వచ్చేయండి' అన్నాడు.

పంతులుగారు ఆవుని మెట్ల వరకూ తీసికెళ్ళారు.

అంతే!

అది మళ్ళీ వెనుదిరిగి పోయింది.

అలా అతను ఎన్ని ప్రయత్నాలో చేశాడు. అది దిగనని మొరాయించింది.

"సర్లెండి రండి భోంచేసి వెళ్లురుగాని, అదే దిగుతుంది'' అన్నాడు. నారాయణమూర్తి.

అందరూ భోజనాల దగ్గర కూర్చున్నాం.

అందరూ అక్కయ్య గురించి చెప్తున్నారు.

"ఉరే, భాస్కరా! నువ్వు సంవత్సరీకాలకయినా వచ్చినందుకు సంతోషంగా వుందిరా! దాని చివరి కోరిక నిన్ను చూడాలనేరా!'' అన్నాడు మా బావ.

మా నారాయణమూర్తి మాత్రం వాళ్ళమ్మ సంవత్సరీకాలను ఘనంగానే జరిపిస్తున్నాడు. ఇంచుమించునూరు మంది బంధువులు వచ్చారు. భోజనాలయినాక కూర్చుని కబుర్లలో పడ్డాం. నారాయణమూర్తి నా దగ్గర కొచ్చి "మావయ్యా! నువ్వు రావటం నాకు చాలా సంతోషంగా వుంది. అమ్మని చూసినంత తృప్తిగా వుంది'' అన్నాడు.

వెంకటరమణమ్మ మా దొడ్డమ్మ కూతురు. నాకు అక్కల్లేరు. దొడ్డకు ఒక్కతే కూతురు. మా పెదనాన్న అక్కకు సంవత్సరం వయస్సులోనే కాలం చేశాడు. దొడ్డ అక్కపైనే ఆశలన్నీ పెట్టుకొని బతికింది. ఎక్కువ కట్నాలిచ్చుకోలేక దగ్గర సంబంధమే చేసింది. పెళ్ళి చేసి సంవత్సరం తిరక్కుండానే కన్ను మూసింది. మా బావ స్థిరుడు కాడు. తాలూకాఫీసులో అటెండరుగా కొన్నాళ్ళు చేసి, ఆఫీసరు తిట్టాడన్న కోపంతో ఉద్యోగం వదలి ఎటో పారిపోయాడు.

అప్పుడు అక్కకి ఇద్దరు మగపిల్లలూ, ఒక ఆడపిల్లాను వాళ్ళ నెలా సాక్కురావాలో తెలీక నా దగ్గర కొచ్చి లబోదిబోమంది. అక్క ఎనిమిదో తరగతి పాసయివుండడం చేత హయ్యరు గ్రేడు ట్రైనింగ్‌కి వెళ్ళమని సలహా ఇచ్చి అందుకు తగిన ఏర్పాట్లూ, ఆర్థిక సహాయం కూడా చేశాను.

అక్క ట్రైనింగ్ పూర్తవగానే మా ఊళ్ళోనే టీచరుగా ఉద్యోగం వచ్చింది. ఈ లోగా మా బావ వచ్చాడు. మరో ఇద్దరాడ పిల్లల్నీ, ఒక మగపిల్లాణ్ణి కన్నాడు. అక్కకీ, బావకీ ఎప్పుడూ పడేది కాదు. పిల్లల్లో పెద్దాడు తప్ప ఎవరూ పనికి రాలేదు.

పెద్దాడు ఎస్సెల్సీ పాసయి తాలూకాఫీసులో ఉద్యోగం సంపాదించాడు. అక్క ఈ విషయాలన్నీ తరచూ ఏ కరువు పెట్టేది. ముందూ, వెనకా చూడకుండా, "పెళ్ళాన్ని పోషించుకోగలడా లేదా?'' అనేనా చూడకుండా ఏ సంబంధం కుదిరితే ఆ సంబంధమే ఖాయపరచి ఆడపిల్లలందరికీ పెళ్ళి చేసింది. అక్క ఉద్యోగస్థురాలవటం చేత అల్లుళ్ళందరూ అక్క పంచనే చేరారు. నారాయణమూర్తికి తల్లి అంటే ప్రాణం. నారాయణమూర్తి భార్యా పాతకాలం మనిషే. అందుకే ఎన్ని కష్టాలొచ్చినా ఇల్లు విడవకుండా అన్నీ భరించింది.

ఈ విషయాలన్నీ వచ్చినప్పుడు చెప్పడమో, ఉత్తరాల్లో రాయడమో చేసేది. నేనొక సంవత్సరం వీలు కుదరక అక్కని కలవలేకపోతే అక్కే వచ్చేసేది. రెండు రోజులు తన బాధలన్నీ చెప్పుకొనేది. మళ్ళీ ఏమన్నా సహాయం చేయబోతే ససేమిరా వద్దనేది.

"ఉరే, కష్టమొచ్చినా, సుఖమొచ్చినా చెప్పుకోవడానికి నాకు నువ్వే వున్నావు. ఇలాంటి సహాయాలు పొంది నీకు దూరం కాదల్చుకోలేదురా! ఈ డబ్బుంది చూశావు. గొప్ప పాపిష్టిది. దీని వల్ల స్నేహం బంధుత్వం అంతా చెడిపోతుంది. ఒకసారి అలవాటయిందనుకో. నాక్కష్టం రాగానే నీ దగ్గరకే రావాలనిపిస్తుంది. నువ్వెన్నీ సార్లు ఇవ్వగలవ్. నువ్వు నాకు భిక్షపెట్టావు. నీ సహాయం ఎప్పుడూ మరువలేను'' అనేది.

ఎంత వారించినా డబ్బు మాత్రం పుచ్చుకొనేది కాదు. మా వాళ్ళందరూ' అక్క సొతంత్రురాలు. ఉద్యోగం లేదని మొగుణ్ణి హీనంగా చూస్తుంది. దాని సొతంత్రమేదానికి కష్టాలు తెచ్చిపెడుతోంది. 'ఆడపెత్తనం డోలు వాయిద్యం' అని తలో రకంగా అన్న వారే గానీ - అక్క పరిస్థితిని మాత్రం ఎవరూ అర్థం చేసుకొనే వారు కాదు. అక్క ఎవర్నీ పట్టించుకునేది కాదు. కానీ ఒక్క విషయానికే బాధపడేది. 'నాలాగే నారాయణమూర్తి బలైపోతున్నాడనీ.'' అయితే

అక్క కూడా వాళ్ళమ్మలాగే ఆఖరి కూతురి పెళ్ళి చేసేసి ఇంకా ఆరు మాసాలు సర్వీసుండగానే చనిపోయింది. సర్వీసులో వుండగానే చనిపోవడంచేత సుమారు లకారం' వచ్చిందని నారాయణమూర్తి రాశాడు. ఆఖరి కొడుకు టెన్త్ పదిసార్లు తప్పి వుంటాడు. వాడికి ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చిందనీ నారాయణమూర్తి రాయగా తెలిసింది.

"ఏంటి మావయ్యా! ఆలోచిస్తున్నావ్?" అన్న నారాయణమూర్తి మాటలకు తేరుకొని, "అయితే నారాయణమూర్తీ! అమ్మ డబ్బేం చేశారు?" అన్నారు.

"వాళ్ళే పంచేసుకున్నారు. తమ్ముళ్ళు మాకు ఆధారం ఏమీ లేదు మాకు న్యాయం చేయమన్నారు. బావలు మాకప్పుడు కట్నాలే ఇవ్వలేదన్నారు. సరే పంచుకోమన్నా, పెన్షను నాన్న పేర్నొస్తోంది. అదీ తమ్ముడే తీసుకుంటాడు. అప్పుడప్పుడు నాన్న చెల్లెళ్ళకిస్తూ - తిక్కపుడితే ఎవరికీ ఇవ్వననీ తనే తీసుకుంటాడు." అన్నాడు.

"మరీ ఖర్చంతా?"

"నేనే పెట్టుకున్నాను. అమ్మకి ఆత్మశాంతి కలగాలి. నేవ్వే చెప్పు మామయ్యా. అమ్మకి కష్టాలే కానీ, సుఖం అన్నది తెలుసా? అందుకే ఖర్చంతా నేనే మీద వేసుకున్నాను." అన్నాడు రుద్ధకంఠంతో

"అవును కానీ వచ్చిన వాళ్ళందరికీ బట్టలేమిటి? గోదానం, హిరణ్యాదానం అని అంత ఖర్చేమిటి? మీ అమ్మ నువ్వు బాధపడితే అసలు శాంతించదు తెలుసా?" దెబ్బలాడినట్లు అన్నాను.

ఈ లోగా-

ఆవుతో కుస్తీలు పడుతున్నారు. ఎంత ప్రయత్నించినా ఆవు బ్రాహ్మల వెనక వెళ్లటం లేదు. "దూడ కోసం భయపడుతున్నదేమో దాని ముందు పెట్టండి దూడని" అని ఒకరన్నారు. దూడను ముందు పెట్టారు.

"ముందు గడ్డి పట్టుకు నడవండి చూద్దాం"

చుట్టాలో ఒకరి సలహా.

గడ్డి ముందు పట్టుకెళ్తోంటే కొంత వరకూ వెళ్ళి ఒక మెట్టు దిగి మళ్ళీ తిరిగిపోయింది.

ఈలోగా చిన్న చిన్న చినుకులుకునేల తడితడిగా అయి గట్టిగా అడుగేస్తే జారుతోంది.

"నాణమూతీ! ఇలారా! ఇంకా మీ అమ్మకేం ఇవ్వాలో గోమాత వెళ్లం లేదు" అన్నాడో పెద్దాయన.

"మీ అమ్మకేం కోరిక మిగిలిందో?" ఇంకొకరు. మా బావని ఉద్దేశించి - "ఏమండోయ్! మీ ఆవిడ సంగతి మీరే చూస్కోండి!" ఇంకొకరు.

నారాయణమూర్తి కళ్ళనీళ్ళ పెట్టుకున్నాడు. "అమ్మా! మావయ్య వచ్చాడు చూడు" అన్నాడు గోమాత తలను నాకేసి తిప్పి అది విసిరికొట్టింది. నారాయణమూర్తి పడిపోయాడు.

"అమ్మా! నాకు గుర్తున్నంత వరకూ తక్కువేం చేయలేదు. నీవు చెప్పమ్మా, నాలో దోషముంటే క్షమించు. నీపాదాలు పట్టుకుంటాను "గోమాత పాదాల దగ్గర మోకరిల్లాడు. అది వెనక్కి పారిపోయింది.

అక్కడున్న వారు రకరకాల సలహాలిచ్చారు. అవి దానం చెయ్యాలి. ఇవి దానం చెయ్యాలీ అన్నారు, గోవు మీద మరో అయిదొందలో, వెయ్యో పెట్టమన్నారు అరెకరమో, ఎకరమో భూదానం చెయ్యమన్నారు. నారాయణమూర్తి అన్నిటికీ ఒప్పుకునేలా కనిపించేసరికి నేను జోక్యం చేసుకోక తప్పలేదు. పరిస్థితినంతా సమీక్షించాను. ఆవు 'గడపదిగి ఎందుకెళ్ళటం లేదా' ఆలోచించాను.

అప్పటికే నారాయణమూర్తి పీకలవరకూ అప్పు చేశాడు. వీళ్ళంతా తలోరకంగా ఆలోచించి, ఉచిత సలహాలిస్తున్నారు. అక్కడున్న వాళ్ళందర్నీ, ఒకప్పుడు అక్క అసహ్యించుకునేది. అక్కని వీళ్ళంతా తలోరకంగా పీక్కు తిన్నవాళ్ళే!

'ఎందుకు గోవు మెట్లు దిగి వెళ్ళడం లేదో' అర్థం కాలేదు. గోవు గడప దిగి రోడ్డు మీద కెళ్ళాలంటే ఇరవై మెట్లు దిగాలి. అవి చిన్న చిన్నవి. ఒక పక్క పెద్ద నుయ్యి లోతుగా కనిపిస్తుంది. మరో పక్క గొయ్యిలా వుంది. దిగేందుకు దానికి భయం వేస్తోందో ఏమో?

"నారాయణా! ఆ తుండు ఇలాతే! "అన్నాను.

గోవుని గట్టిగా పట్టుకోమన్నాను. దాని కొమ్ముల మీద నుండి కళ్ళు కనిపించకుండా తుండుగుడ్డ గట్టిగా కట్టేశాను. కన్నె పట్టుకొని ముందొకరు జాగర్తగా దిగండన్నాను. ఒక మెట్టు దిగింది గోవు. మళ్ళీ వెనకడుగు వేయబోయింది. అందరూ నన్నెకసెక్కం చెయ్యడానికి సిద్దంగా వున్నారు.

నేను దాని పృష్ఠభాగాన్ని ముందుకు తోశాను. అది ఒక్క దూకు కిందికి దూకింది. కన్ని పట్టుకున్న పంతులు పుచ్చకాయలా మెట్టు మీద నుండి దొర్లి కింద పడ్డాడు. గోవు మాత్రం రోడ్డు మీద చతికిల పడింది. నేను గోవుకి కట్టిన గంతలు విప్పాను.

గోవు నాలుగు కాళ్ళతో కుదురుగా నిలబడింది. ముందున్న దాని దూడని తనివితీరా నాకడం మొదలెట్టింది. గోవు గడపదిగిన సంతోషంతో తగిలిన దెబ్బని ఖాతరు చేయకపంతులుగారు గదపదిగి గోవు మెడలో కన్ని అందుకుని ముందుకు నడిచారు. "వాస్తబాబూ!" అని రెండు చేతులూ జోడించి,

గోవు కరుణించింది. గోమాత దయ చూపింది. చకచకా నడుచుకుంటూ పంతులుగారి వెనుక వెళ్తోంది.

"ఏదయినా వాళ్ళ తమ్ముడు చెప్పాడు కాబట్టి వింది" అన్నారంతా.

మరి నాకా సమయంలో ఆ ఆలోచనే రాకపోతే మా నారాయణమూర్తి చేత ఆ మూర్ఖశిఖామణులు ఇంకెంత ఖర్చు చేయించేసేవారో?

(29-7-94 స్వాతి సపరివార పత్రిక నుండి)

❀ ❀ ❀ ❀